# తెరవెనుక స్వప్నం!

-గోపి రాజు రాధాకృష్ణ



నన్ను నువ్వు కుశలమడుగుతావని నాకు తెలుసు. కుశలం అడిగే అవకాశం నీకివ్వకుండా ముందు నేనే అడిగాను. దయుంచి నా గురించి అడక్కు.

ఎంతో కావలసిన, ముఖ్యమైన వ్యక్తి అయితేగానీ పరామర్శ నిమిత్తం హాస్పిటల్ కి వెళ్లడు రామచంద్రం. హాస్పిటల్ వాతావరణం అతనికి ఎలర్జీ. స్పిరిట్, ఫినయిల్ కలిసివచ్చే వాసనంటే అసలు గిట్టదు.

ఆఫీసులో 'దేవుడు' నిక్‌నేమీయుడు. రామచంద్రం శ్రేయోభిలాషి కొలిగ్ సంజీవయ్యకి హార్టుఎటాక్ వచ్చి హాస్పిటల్ లో చేరాడు.

కష్టాలు మనుషులిక్కాక మానులకొస్తాయా మరి' మనుషుల్లోనూ మంచి మనుషులకే కష్టాలు కట్టకట్టుకుని మరీ వస్తాయి.

రామచంద్రానికి, అతని భార్య సునీతకి సంజీవయ్య పరిచయస్తుడే. రామచంద్రానికంటే ముందు సునీతే సంజీవయ్యని చూసొచ్చింది. ఓ వారం రోజుల ముందు.

ద్రాక్షపళ్లు, యాపిల్స్‌తో వెళ్లేడు రామచంద్రం. పోలోథీన్ బాగ్ ఆయనకిచ్చి ఆయన్తో ఫేమిలీ మెంబర్స్ ఎవరో మాట్లాడుతుంటే, విష్ చేసి అగ్నిహోత్రం వెయ్యడానికి కారిడార్లోకి వచ్చేడు రామచంద్రం

మూడు గదుల తర్వాతి గదిలోంచి చంకలో ఏడుస్తున్న బిడ్డతో ప్లాస్టిక్ విసనక్రరతో విసురుకుంటూ వచ్చింది ఒకామె.

ఆమెను చూసి రామచంద్రం రెప్పలు స్తంభించిపోయాయి. అతని కళ్లని అతనే నమ్మలేకపోయాడు. కలో నిజమో అర్థంకాని సందిగ్ధంలో పడ్డాడు. పెట్టెలోంచి సిగరెట్ తియ్యబోతూ అలా నిల్చుండిపోయాడు. 'ఉమ' అప్రయత్నంగా అనుకున్నాడు.

ఆమె కూడా స్తబ్దురాలై నిలబడిపోయింది. ఇద్దరి చూపులూ వారధి కట్టుకున్నాయి.

మూడు సంవత్సరాల సుదీర్ఘమైన అగాథం అనంతరం యాదృచ్ఛికంగా అక్కడ కలిశారిద్దరూ

చంకలో బిడ్డని సరి చేస్కుని కొంత ఇవతలికి వచ్చిందామె; రామచంద్రం ఆమె వైపు నడిచాడు.

చంద్రం బాగున్నావా? ఆమె కంఠం నిండా ఆప్యాయత.

ఆ!ఆ! బానే వున్నా! అని చంకలో బిడ్డని తీస్కుని "అన్నీ నీ పోలికలే" అన్నాడు రామచంద్రం ఆమెతో. 'నీ పెళ్లికి రాలేకపోయాను. కనీసం గ్రీటింగ్స్ ఇవ్వాలని కూడా అనిపించలేదు. నువ్వు పరులసొత్తు అయిపోతున్నావనే బాధలో ఇంగితాన్ని మర్చిపోయాను ఉమా' నొచ్చుకున్నాడు.

సరే ఆ విషయం వదిలేయి. ఏమిటి... ఎక్కడుంటున్నావ్... ఏం చేస్తున్నావ్.. పెళ్లయిందా... కథ కమామీషు.. అని ఉమ ఏదో అడుగుతుంటే మధ్యలో ఆపాడు రామచంద్రం.

"మీ ఆయన.."

లిప్తలో ఉమ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఊహించని ఆ పరిణామానికి నిర్విణ్ణుడయ్యాడు రామచంద్రం.

ఉమా ఏమిటిది చిన్నపిల్లలా.. ప్లీజ్... ఏడవకు. ఎవరైనా చూస్తే బాగోదు సముదాయించాడు.

నన్ను నువ్వు కుశలమడుగుతావని నాకు తెలుసు. కుశలం అడిగే అవకాశం నీకివ్వకుండా ముందు నేనే అడిగాను. దయుంచి నా గురించి అడక్కు.. అదొక నరకం భూలోక నరకం. బైట పెట్టడం నా అసమర్థతే అవుతుంది అని పైట కొంగు తో కళ్లొత్తుకుంది ఉమ. ఇంకా ఊరుతూనే వున్నాయి.

జీవితమ్మీదే విరక్తిపుట్టింది రామచంద్రం! ఒక్కోసారి చచ్చిపోవాలని అనిపిస్తుంటుంది. నన్ను చావకుండా చేస్తున్నది వీడే. వీడిమీదే నా మమకారం అని రామచంద్రం చంకలో వున్న బిడ్డని నిమిరింది.

"వీడి పేరేమిటో తెలుసా.... రామచంద్రరావు"

రామచంద్రం ఒక్కసారిగా రెప్పలెత్తి ఉమని చూశాడు.

నా గురించి ఏం అడక్కు .నీ గురించి చెప్పు బిడ్డని తీస్కుని విసురుతూ అడిగింది ఉమ.

రామచంద్రం గుండె మండువాలో, మనసు ముంగిట్లో మెదుల్తున్న అనుమానాన్ని ఆమెతో అంటే ఆమె సమాధానం చెప్పడానికి నిరాకరించింది. పైగా తిరిగి ప్రశ్న వేసింది. నీ గురించి చెప్పు అని అడిగింది.

చెప్పడానికి ఏముంది ఉమా? బతికెయ్యడానికి సరిపడే జీతం వస్తోంది. పెళ్లి అయ్యింది. ఓ ఫార్మాస్యుటికల్స్ కంపెనీలో కెమిస్ట్‌గా ఉద్యోగం. ముక్తసరిగా సమాధానం ఇచ్చాడు రామచంద్రం.

మా కొలిగ్ ఒకాయన ఇక్కడున్నాడు. చూడ్డానికి వచ్చాను అని కాస్సేపాగి ఇంతకీ నీ గురించి ఏం చెప్పలేదు రెట్టించాడు.

మళ్లీ ఉమ కళ్లల్లో నీళ్లు నిలిచేయి. మౌనంగా రోదిస్తుంది. నా కర్మ ఇట్లా కాలింది. సంసార విషయాలు బైటికి చెప్పడం అవివేకం అవుతుంది. కానీ నా మనసు మాటలు నీ ముందు దాగడంలేదు.

మా వారు పైకి కనిపించేంత మంచివారు కాదు. శాడిస్టు. నరరూప రాక్షసుడు. నన్ను బాధించని రోజుండదు. అని ఆగి ఓ సారి అటూ ఇటూ చూసింది. ఓ నర్సు గదిలోకి పోతూ కనిపించింది. అసలు నీ మాట వినినిన్ను పెళ్లిచేస్కునివుంటేనా జీవితంయిలా ముళ్లబాట అయ్యుండేది కాదు అంది ఉమ.

గాఢంగా నిట్టూర్చాడు రామచంద్రం.

మా రెలెటివ్స్‌లో ఓ అమ్మాయికి డెలివరీ అయ్యింది. పదిరోజుల్నుంచీ ఇక్కడేవుంటున్నాను అంది ఉమ కొడుకుని జోకొడుతూ.

కాస్సేపు నిశ్శబ్దం రాజ్యమేలింది.

ఓ చిన్ననాటి స్నేహితురాలు ఒకామె కనిపించింది. చాలా కాలం తర్వాత మొన్నే కనిపించింది. ఆమె కథా.. అలా మా ఆడవాళ్లంతా వంచనకు గురవ్వడం ఆదేవుడు మాకిచ్చిన శాపం. పరపీడన పరాయణత్వం. కొన్ని జీవితాలు యిలా జరిగిపోవలిసిందే. బాధగా అంది ఉమ.

నీలాంటి సహృదయుడికి భార్య కావడం మీ మిసెస్ చేసుకున్న అదృష్టం. ఎప్పుడైనా బాధ మరీఎక్కువగా వుంటే నీకు ఉత్తరం రాస్తాను నా తృప్తి కోసం. జవాబు వ్రాయకు. అడ్రసివ్వు రామచంద్రాన్ని అడిగింది ఉమ.

ఎడ్రస్ రాసి ఇచ్చాడు రామచంద్రం.

ఎవరో పిలవడంతో ఓసారి రామచంద్రాన్ని చూసి గదిలోకి వెళ్లిపోయింది ఉమ. రామచంద్రం మనసు చివుక్కుమంది. ప్చ్ అనుకున్నాడు. ఆమెమీద సానుభూతి ప్రకటించి బాధపడ్డాడు. అంతకుమించి రామచంద్రం మాత్రం ఏం చెయ్యగలడు?

సంజీవయ్య ఉన్న గదికి వెళ్లాడు రామచంద్రం. అప్పటికి ఆయన ఫామిలీ మెంబర్స్ఎవరూ ఆయన దగ్గరలేరు.

పీట లాక్కుని కూర్చుని ఏం సంజీవయ్యగారూ? ఎట్లావున్నారు? అని అడిగాడు ఫార్మాలిటీ కోసం.

గుండె కొంచెం మారాము చేసింది. ఇప్పుడు దాని విధ్యుక్తధర్మం బాగానే నిర్వర్తిస్తోంది. చమత్కార సరళిలో అన్నారు సంజీవయ్య .మీ దంపతులిద్దరూ వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా వుందోయ్ రామచంద్రం.

ఓ పావుగంట మాట్లాడి నర్స్ చెప్పిన మీదట శెలవు తీస్కుని బైటకొచ్చేశాడు రామచంద్రం.

ఉమ కోసం ప్రయత్నించాడు ఆమె కనిపించలేదు

విరామం లేని శీఘ్రగమన కాలప్రస్థానంలోకి రోజులు కలుస్తున్నాయి. కాలం హారతి పళ్లెంలో రోజులు కర్పూరంలా కరిగిపోతున్నాయి.

ఆ రోజు ఉమ బాధ పరాకాష్టకు చేరింది. భర్త ఆమె ఒంటిమీద సిగరెట్లతో కాల్చాడు. రామచంద్రం గుర్తుకొచ్చాడామెకి.

అతను రాసిచ్చిన అడ్రస్ మిస్ అవ్వకుండా డైరీలో రాయడానికి అడ్రస్ కాగితం తీసింది.

అంతకుముందే చిన్ననాటి స్నేహితురాలి చిరునామా ఆ డైరీలో నోట్ చేసింది. ఎప్పుడైనా అక్కడికి వెడితే చిన్ననాటి స్నేహితురాల్ని కలవొచ్చని హాస్పిటల్లో కలిసి ఆమె బాధని వ్యక్తం చేసినపుడు ఆమె దగ్గర అడ్రస్ తీసుకుంది ఉమ.

రామచంద్రం ఎడ్రస్ నోట్ చేస్తోంది.

దానిపై అడ్రస్ చూసి ఆశ్చర్యపోయింది ఉమ.

ఆ రెండు చిరునామాలూ ఒక్కటే!